
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్

5

గురువారం 4 సెప్టెంబరు 2025

జిల్లాల వార్తలు

మెదక్‌లో భవనం కూల్చివేత

మున్సిపల్ అధికారుల హఠాత్తు చర్యలపై అనుమానాలు



మున్సిపల్ అధికారులు కూల్చివేసిన భవనం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని ఓ భవనం కూల్చివేత వ్యవహారం బుధవారం చర్చనీయాంశమైంది. నిర్మాణం పూర్తయిన తర్వాత మున్సిపల్ అధికారులు దాన్ని కూల్చివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని గీతా కళాశాల సమీపంలో కొన్ని రోజులుగా నిర్మాణంలో ఉన్న భవనంపై వివాదాలు కొనసాగుతున్నాయి. ఆరోపణలు ఉన్నప్పటికీ, అనుమతులు ఉన్నాయంటూ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే, బుధవారం సాయంత్రం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో వచ్చి భవనంలోని కొంత భాగాన్ని కూల్చివేశారు. ఈ చర్యపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భవనం నిర్మాణం జరుగుతున్నప్పుడు స్పందించని అధికారులు, నిర్మాణం పూర్తయ్యాక ఇలా కూల్చివేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారి(టీపీవో) భూపతిని వివరణ కోరగా, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కూల్చివేత చేపట్టినట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపట్టడం వల్లే ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే, ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అకస్మాత్తుగా భవనాన్ని కూల్చివేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లు సక్రమంగా ఉన్న నిర్మాణం ఒక్కసారిగా అక్రమంగా ఎలా మారిందని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

సంగారెడ్డి జిల్లా డీసీహెచ్ఎస్‌గా డా. మహ్మద్‌షరీఫ్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్తగా(డీసీహెచ్ఎస్) డా.షేక్ మహ్మద్ షరీఫ్‌ను నియమిస్తూ టీవీవీపీ కమిషనర్ డా.జె.అజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గత డీసీహెచ్ఎస్ డా.కె.సంగారెడ్డిని హైదరాబాద్‌లోని టీవీవీపీ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని, ఆయన స్థానంలో డీసీహెచ్ఎస్‌గా డా.యాదగిరిని నియమిస్తూ గత నెల 26న కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే డా.యాదగిరి డీసీహెచ్ఎస్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు సుముఖంగా లేనని లిఖితపూర్వకంగా రాసివ్వడంతో తాజాగా జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని రేడియాలజీస్ట్‌గా (సీఎస్ఎస్) విధులు నిర్వహిస్తున్న షేక్ మహ్మద్‌షరీఫ్‌ను ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా నియమించారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో కలిసి రాజీవ్‌పార్క్‌ను పరిశీలించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, జగ్గారెడ్డి

● టీయూఎఫ్ఐడీసీ, హెచ్ఎండీఏ నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా



రాజీవ్‌పార్కు అభివృద్ధిపై కలెక్టర్‌కు వివరిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పి.ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సంగారెడ్డిలోని రాజీవ్ పార్కును బుధవారం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పరిశీలించారు. టీయూఎఫ్ఐడీసీ, హెచ్ఎండీఏ నిధులతో రాజీవ్ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేశారు. అంశాల వారీగా పరిశీలిస్తే

- మూడు కోట్ల రూపాయల టీయూఎఫ్ఐడీసీ నిధులతో రాజీవ్ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు
- రాజీవ్ పార్కు అభివృద్ధి నమూనాల కోసం హెచ్ఎండీఏ సహకారం తీసుకోవాలని నిర్ణయం
- లైటింగ్, టాయిలెట్ బ్లాక్, ల్యాండ్ స్కేపింగ్ చేయించాలని కలెక్టర్‌కు వివరించిన అధికారులు
- రాజీవ్‌పార్కులో ఉన్న మ్యూజికల్ ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని అధికారులకు సూచించిన కలెక్టర్
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సంగారెడ్డి ప్రజలకు ఆహ్లాదం అందించేలా రాజీవ్‌పార్కును తీర్చిదిద్దిన విషయాలను జగ్గారెడ్డి కలెక్టర్‌తో పంచుకున్నారు
- పార్కును ఆనుకుని ఉన్న స్విమ్మింగ్‌ఫూల్, దానికి ఆనుకుని ఉన్న భూమిని కలుపి డెవలప్‌మెంట్ చేయాలి
- పార్కును ఆనుకుని ఉన్న ఎకరన్నర స్థలంలో మినీ పాండ్, పెడల్ బోట్లు ఏర్పాటు చేసేలా డిజైన్ చేయాలని అధికారులకు సూచించిన కలెక్టర్
- స్విమ్మింగ్‌ఫూల్, టాయిలెట్స్, డ్రెస్సింగ్‌రూమ్‌ల రిపేర్ కోసం నిధులు కావాలని కలెక్టర్‌ను కోరిన అధికారులు



రాజీవ్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

- స్విమ్మింగ్‌ఫూల్‌లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టైమింగ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచన
- స్విమ్మింగ్‌ఫూల్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో పీపీటీ పద్ధతిలో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించిన కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్.



మత్స్యకారుల జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం అమలులో తీవ్ర జాప్యం నెలకొంది. వాస్తవానికి జూలై మూడో వారంలోనే చేప పిల్లలను చెరువుల్లో వదలాల్సి ఉంది. కానీ, సెప్టెంబరు నెల ప్రారంభమైనా ఇంకా పంపిణీ ప్రక్రియ టెండర్ల దశలోనే ఉండడంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతేడాది బకాయిపడిన బిల్లులు కాంట్రాక్టర్లకు ఇంకా చెల్లించకపోవడం ఈ ఆలస్యానికి కారణం. ఈసారి బిడ్లు దాఖలు చేయడానికి ఏ కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. దీంతో టెండర్ గడువును పొడిగించారు.

- మెదక్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

చెరువుకు చేరేనా?

ఉచిత చేప పిల్లల పంపిణీకి అడ్డంకులు

ఇంకా టెండర్ల దశలోనే పంపిణీ ప్రక్రియ

కాంట్రాక్టర్లకు గతేడాది బిల్లుల బకాయి

బిడ్లు దాఖలుపై నిరాసక్తత

టెండర్ గడువు పొడిగింపు

మత్స్యకారుల్లో ఆందోళన

మెదక్ జిల్లాలో మొత్తం 309 మత్స్య సహకార సొసైటీలు ఉన్నాయి. ఈ సొసైటీల్లో 16,820 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను అందిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులు, జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. మెదక్ జిల్లాలో మొత్తం 1,728 చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి మత్స్య శాఖ అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది ఉచితంగా 5 కోట్ల 32 లక్షల చేప పిల్లలను ఈ చెరువుల్లోకి విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

టెండర్లకు ఆహ్వానం.. ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

జలాశయాల విస్తీర్ణం, వనరుల ఆధారంగా ఈ చేప పిల్లలకు టెండర్లు నిర్వహించేందుకు రాష్ట్ర మత్స్యశాఖ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు దీర్ఘకాలం, స్వల్పకాలం నీటి సౌకర్యం ఉండే చెరువులను గుర్తించి వివిధ సైజుల్లో ఉన్న చేప పిల్లలను వదిలేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 35-40 మిల్లీ మీటర్ల సైజు చేపపిల్లలు 3.99 కోట్లు కాగా, 80-100 మిల్లీమీటర్ల సైజు 1.32 కోట్ల చేపపిల్లలకు టెండర్లు

మిగతా 8వ పేజీలో

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది



ప్రభుత్వ నిబంధనల మేరకు టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నాం. బిడ్ల దాఖలకు ఈనెల 8 వరకు గడువు పెంచాం. టెండర్లు ఖరారు కాగానే వెంటనే చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తాం. మత్స్యకారులు ఆందోళన చెందవద్దు. నాణ్యమైన చేప పిల్లలను చెరువుల్లో వదులుతాం.

-మల్లేశం, మెదక్ జిల్లా మత్స్యశాఖ అధికారి



సర్వం సిద్ధం

నేడు మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం

రూ.483.75 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

హాజరుకానున్న మంత్రులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.483.75 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.186.6 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ పరిపాలన, హాస్టల్ భవనాలు, అదేవిధంగా టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో రూ.273.4 కోట్లతో నిర్మించనున్న 500 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన, అలాగే రూ. 23.75 కోట్లతో 'క్రిటికల్ కేర్' బ్లాక్‌ను గురువారం ఉదయం 11 గంటలకు మంత్రులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆయా భవనాల ప్రారంభోత్సవ, శంకుస్థాపన ఏర్పాట్లు చేరుకుగా కొనసాగుతుండగా, ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు డీఎంఈ డా.వాణి, అధికారులు పరిశీలించారు.

వర్చువల్‌గా క్యాన్సర్ డే కేర్ ప్రారంభోత్సవం

రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన జిల్లా క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రులు సంగారెడ్డి నుంచే గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. మెడికల్ కాలేజీలోని లెక్చరర్ హాల్ నుంచి సంగారెడ్డితో పాటు వివిధ ఆస్పత్రుల్లో నెలకొల్పిన క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రులు ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మెడికోలను ఉద్దేశించి మంత్రుల ప్రసంగించనున్నారు.

అమాత్యా.. ఆలకించండి!

జీజీహెచ్‌లో ఎంఆర్ఐ సేవలు కల్పించండి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఎంఆర్ఐ స్కాన్ సదుపాయం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. రోగులు ప్రైవేటులో డబ్బులు వెచ్చించి చేయించుకోవాల్సి వస్తున్నది. జీజీహెచ్‌లో నిత్యం సుమారు 1700 మంది ఓపీ ద్వారా 450 మంది ఇన్‌పేషెంట్ రోగులు చికిత్స పొందుతుంటారు. ఇక్కడ

మిగతా 8వ పేజీలో

నిమజ్జనం ఏర్పాట్లలో విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



సింధు చింటు(ఫైల్)

కొండాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనానికి ఉట్టికొట్టే ఏర్పాట్లు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలియువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పోలీస్‌స్టేషన్ లో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ సోమేశ్వరీ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని హరిదాస్‌పూర్ గ్రామానికి చెందిన సింధు చింటు(20) రోజు కూలీ. తండ్రి మాన్యయ్య అనారోగ్యంతో చనిపోవడంతో తల్లి యాదమ్మకు తోడుగా కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. బుధవారం గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నాడు. ఉట్టికొట్టేందుకు ఇనుప రాడ్‌ను పాతే క్రమంలో 11కేవీ విద్యుత్ తీగలకు ఆ రాడ్ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై చింటు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. చింటు మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





నారాయణఖేడ్ - బీదర్ మధ్య కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు, నారాయణఖేడ్ సమీపంలో నిర్మిస్తున్న వంతెన

161బీ హైవే విస్తరణ వేగవంతం

ఖేడ్-నిజాంపేట మధ్య కొనసాగుతున్న పనులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ - నిజాంపేట్ - బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిజాంపేట నుంచి నారాయణఖేడ్ మీదుగా కర్ణాటకలోని బీదర్ వరకు 46 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా మారుస్తూ విస్తరణ కోసం ప్రభుత్వం రూ.523 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ గతేడాది విస్తరణ పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు 30 కిలోమీటర్ల మేర పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 12 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు బీటీ పనులు పూర్తి అయ్యాయి. కొన్నిచోట్ల సివిల్ పనులు జరుగుతున్నాయి. నారాయణఖేడ్ నిజాంపేట మధ్య 14 కిలోమీటర్ల రోడ్డు, 14 మలుపులతో డబుల్‌రోడ్డుగా ఉన్నప్పటికీ, జాతీయ రహదారిగా మారడంతో ఇటీవల విస్తరణ పనులను ప్రారంభించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో సమీపంలో వంతెన విస్తరణ కోసం పనులను ప్రారంభించారు. అయితే, ఇటీవల వర్షాలతో అంతరాయం ఏర్పడింది. ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే మలుపులు కనుమరుగవుతాయి. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. వచ్చే ఏడాది ఆగస్టులోగా అన్ని పనులు పూర్తవుతాయని నేషనల్ హైవే డిప్యూటీ ఈఈ రామకృష్ణ తెలిపారు.

వరద నష్టం అంచనాలు పూర్తిచేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



అల్లాదుర్గంలో పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాల కారణంగా వరద ఉధృతికి దెబ్బతిన్న పంటలు, ధ్వంసమైన రోడ్లు తదితర వాటికి సంబంధించిన నష్టం అంచనాలను స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిబంధనల మేరకు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్య, ఆరోగ్య అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కల్వర్టులు, కాజ్వేలు, ఇరిగేషన్ ట్యాంకులు, పాఠశాలలు, ఆసుపత్రులు, వరద నష్టం అంచనాలు, తాత్కాలికంగా, శాశ్వతంగా చేపట్టే పనుల అంచనాలు వేర్వేరుగా రూపొందించాలని సూచించారు.

రైతులు అధైర్యపడొద్దు : కలెక్టర్

అల్లాదుర్గం/టేక్మాల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, బాధిత రైతంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆయన బుధవారం అల్లాదుర్గంలోని బట్టికుంట చెరువు గండితో దెబ్బతిన్న పంటపొలాలను, గుంతలమయమైన రోడ్డును, మండలంలోని గడిపెద్దాపూర్‌లోని పంటలను, టేక్మాల్ మండలం బోడ్మాట్‌పల్లిలో దెబ్బతిన్న పత్తి పంటను, గుండువాగు ప్రవాహానికి కోతకు గురైన రోడ్డును పరిశీలించారు.

గణనాథుల నిమజ్జనానికి ఏర్పాట్లు

● మెదక్ జిల్లాలో 546, సంగారెడ్డి జిల్లాలో 800 మందితో పోలీస్ బందోబస్తు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా వ్యాప్తంగా 2,963 వినాయక విగ్రహాలున్నాయి. జిల్లా కేంద్రంలోని విగ్రహాలను మండల పరిధిలోని కొంటూర్ చెరువులో నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ శోభాయాత్రలు ప్రశాంతంగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు 498 వినాయకుల నిమజ్జనం పూర్తి చేసుకున్నాయి. ఒక్కొక్కటిగా విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్తున్నాయి. ఈనెల 7న చంద్రగ్రహణం కారణంగా చాల చోట్ల తొమ్మిది రోజైన గురువారమే నిమజ్జనం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నిమజ్జనం 11వ రోజు శనివారం వరకు కొనసాగనుంది. నిమజ్జన కేంద్రాల వద్ద రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్‌శాఖ అధికారులు, క్రేన్లు, లైటింగ్‌తోపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు ఏర్పాట్ల దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.



కొంటూర్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

పటిష్ఠ భద్రత : ఎస్పీ శ్రీనివాసరావు

గణేష్ శోభయాత్ర సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 546 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పెట్రోలింగ్ వాహనాల ఏర్పాటు, ఐడీపార్టీ, షీటీమ్‌లు బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. గణేష్ విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలపై ఎక్కువ మంది ఉండకుండా చూడాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

సంగారెడ్డి జిల్లాలో గట్టి బందోబస్తు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురు, శనివారాల్లో జరుగనున్న గణనాథుల శోభాయాత్ర,

మిగతా 8వ పేజీలో



భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

టేక్మాల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం, టేక్మాల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మడ్డె సురేష్(26)కు, సునితకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. సురేష్ అల్లాదుర్గం సర్కిల్‌లోని 108లో విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఉద్యోగం నిమిత్తం వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. దీంతో భార్య సునితఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లావు అని అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సెప్టెంబరు 2న సాయంత్రం సురేష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా అతని ఆచూకి లభించలేదు. దీంతో బుధవారం భార్య సునిత టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సురేష్(ఫైల్)

గంజాయి పట్టివేత

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా 140 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు హనుమంతు, అనుదీప్ తెలిపారు. పట్టణ సమీపంలోని అల్గోల్-అల్లా రోడ్డుపై వాహనాల తనిఖీలు చేపట్టగా, సత్వార్‌కు చెందిన మహ్మద్ ఖయ్యూం, ఫకీర్ అయ్యూబ్ స్కూటీపై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల నలుగురు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. ఒకరు ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుంటే, మిగతవారు మద్యానికి బానిసై, కుటుంబ కలహాలు, అక్రమ సంబంధం కారణంగా బలవన్మరణం పొందారు.

ఆర్థిక ఇబ్బందులతో..

రామచంద్రాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బీహెచ్ఈఎల్ ఎంఐజీ ఫేజ్-2 కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం, ఎంఐజీలో నివసించే మహేష్(37) చిరువ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మానసికంగా బాధపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భార్య, కూతురు గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో ఉండగా, మహేష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై..

దుబ్బాక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట వార్డుకు చెందిన ఒక వ్యక్తి మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బూరు మల్లేశం(61) కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు.

కుటుంబ కలహాలతో యువతి..

కౌడిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తరుచూ గొడవలు పడుతుండటంతో జీవితంపై విరక్తి చెంది యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహ్మద్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజితరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మహ్మద్‌నగర్‌కు చెందిన బండల శమంత, మైసయ్య దంపతులు తరుచూ గొడవ పడుతున్నారు. మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులు గొడవ పడుతుండగా వారి కూతురు అక్షిత(21) వారిని ప్రశ్నించి, క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు గమనించి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధంపై మందలించినందుకు ..

హవేళిఘణపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం వద్దని మందలించడంతో వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, నాగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య భార్య కళ్యాణి(28) అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. గత నెల 29న ఇంట్లో కళ్యాణి ఓ వ్యక్తితో కనిపించడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో పురుగుల మందు తాగింది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త ఎల్లయ్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

రామాయంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట-హైదరాబాద్ హైవేపై వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. మృతుడికి సుమారు నలభై ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిస్తే రామాయంపేట పోలీస్ స్టేషన్ (8712657934)కు సమాచారం ఇవ్వాలని ఎస్సై బాల్‌రాజ్ కోరారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనానికి పాదయాత్ర చేస్తుండగా వాహనం ఢీ కొని దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిజిల్లా పిట్లం మండలం హుస్నాపూర్ గ్రామానికి చెందిన శివకాంత్ (32) భార్య రమ్యతో కలిసి ఐదేళ్ల క్రితం ఇస్నాపూర్ మున్సిపల్ పట్టణంలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. బుధవారం రుద్రారం గణేష్‌గడ్డ ఆలయ దర్శనానికి స్నేహితుడు అంబారి రాజులు పాదయాత్ర చేస్తూ ఇస్నాపూర్ నుంచి రుద్రారం వెళ్తున్నారు. మార్గమధ్యలో ఎంఎస్ఎన్ పరిశ్రమ వద్దకు వచ్చే సమయానికి వెనుకనుంచి డీసీఎం వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలయి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. భార్య రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ..

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు శివారులోని పౌల్ట్రీ ఫాం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన రాజు (26) పది రోజుల క్రితం పుల్లూరులోని పౌల్ట్రీ ఫాంలో పనిలో చేరాడు. బుధవారం పౌల్ట్రీ ఫాం చుట్టూ పరదాలు కడుతుండగా, అతను పట్టుకున్న ఇనుప నిచ్చెన సింగిల్ ఫేజ్ డీటీఆర్‌కు తగిలింది. దీంతో విద్యుత్ షాక్ గురై రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఒక కూతురు ఉన్నారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రాజు మృతదేహం

చికిత్స పొందుతూ యువకుడు..


పటాన్‌చెరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో పండ్ల వ్యాపారం చేసే రిజ్వాన్(20) గత నెల 18న రాత్రి స్నేహితులతో కలిసి కారులో వచ్చి రుద్రారం శివారులోని ఓ దాబాలో భోజనం చేసి తిరుగు ప్రయాణంలో పటాన్‌చెరు వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారు పల్టీలు కొట్టడంతో రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి హమీద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ నుంచి గుజరాత్‌కు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు బుధవారం సమాచారం వచ్చింది. ఈ మేరకు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ లారీలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో లారీని, 300 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.





















మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కేరళ బృందం

మహిళా శక్తి క్యాంటీన్ పథకం భేష్

● కేరళ కుటుంబశ్రీ ఎన్ఆర్‌వో నిర్వాహకురాలు శ్యామల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కేరళ రాష్ట్రానికి చెందిన కుటుంబశ్రీ నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ (ఎన్ఆర్‌వో) నిర్వాహకురాలు శ్యామల బుధవారం సందర్శించారు. ఇందిరా మహిళా శక్తి పేరిట మహిళలు స్వయంగా ఉపాధి పొందే తీరును ఆమె పరిశీలించి, ఈ పథకం అమలును ప్రశంసించారు. అంతకుముందు ఆమె క్యాంటీన్ కిచెన్‌తో పాటు మహిళా నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీవో జ్యోతిని కలిసి పథకం అమలు తీరును తెలుసుకున్నారు. ఆమె వెంట డీపీఎంలు రమేశ్‌బాబు, కిన్నెడి, ఏపీఎం వెంకట్, సీసీలు శ్రవణ్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

బస్సులో దొరికిన నల్లపూసల దండను బాధితులకు అప్పగింత



నల్లపూసల దండను అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

దుబ్బాక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో మంగళవారం ఒక ప్రయాణికుడు మరిచిపోయిన రూ.70 వేల విలువైన నల్లపూసల దండను తిరిగి అప్పగించిన సంఘటన దుబ్బాక డిపోలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి: నారాయణఖేడ్ నుంచి పటాన్‌చెరు వరకు ప్రయాణించిన ఒక వ్యక్తి తన బ్యాగును బస్సులో మరిచిపోయాడు. కొంతసేపటికి డ్యూటీలో ఉన్న కండక్టర్ రాజేశం బ్యాగును గమనించి, దానిని తెరిచి చూడగా నల్లపూసల దండ కనిపించింది. విషయాన్ని డిపో అధికారులకు తెలిపారు. డ్యూటీ అయిపోయిన తర్వాత కండక్టర్, డ్రైవర్ శ్రీనివాస్ కలిసి బ్యాగును అధికారులకు అప్పగించారు. బ్యాగు పోగొట్టుకున్న పవన్ కుమార్ అనే ప్రయాణికుడు తన టికెట్ ఆధారంగా డిపో అధికారులకు ఫోన్ చేసి, డిపోకు వచ్చాడు. అతని వివరాలు తెలుసుకుని నిర్ధారించుకున్న తర్వాత డిపో ఇన్‌చార్జి కనకలక్ష్మి, కంట్రోలర్లు లోహిత్‌రావు, నారాయణ కలిసి ఆ దండను అతనికి అప్పగించారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించిన కండక్టర్ రాజేశం, డ్రైవర్ శ్రీనివాస్‌ను డిపో మేనేజర్ రఘు, ఇన్‌చార్జి కనకలక్ష్మి అభినందించారు.

మేకల దొంగ అరెస్ట్



నిందితుణ్ని చూపెడుతున్న టూ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మేకల దొంగను బుధవారం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్‌కు చెందిన ఒళ్లేపు శేఖర్ ఈ నెల 2న రాత్రి తన ఐదు మేకలను నిరుపయోగంగా ఉన్న బాత్‌రూంలో ఉంచి పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి మేకలు లేకపోవడంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం సిద్దిపేట అంగడిలో వెతుకుతుండగా సిద్దిపేట డబుల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన ఒర్సు కృష్ణ ఐదు మేకలను అమ్మడానికి వచ్చి అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా, మేకలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి ఐదు మేకలను స్వాధీనం చేసుకున్నారు.

క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో సంగారెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు బి.కృష్ణ, సయిద్ అన్వర్ ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. సెప్టెంబరు 2న హైదరాబాద్‌లోని కోఠిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ఈ బహుమతిని సాధించారు. వారిని ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకుడు రవికుమార్ అభినందించారు. వీరు బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



బిందెల బండి

బరువు తక్కువగా ఉన్నప్పటికీ బులేరో వాహనంపై పెద్ద ఎత్తున ప్లాస్టిక్ బిందెలను ఇలా విక్రయానికి తీసుకెళ్లడం చూపరులను ఆకట్టుకున్నది. నారాయణఖేడ్ వైపు వస్తుండగా ప్రజలు ఆసక్తిగా చూశారు.

- నారాయణఖేడ్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి)



చౌటకూర్‌లో యూరియా బస్తాల కోసం బారులు తీరిన రైతులు



తూప్రాన్ మండలం యావాపూర్ వద్ద రాస్తారోకో

యూరియా కోసం పాట్లు

● ఒక్కో బస్తాపై అదనంగా రూ.40 వసూలు

పుల్‌కల్/గజ్వేల్/మద్దూరు/దుబ్బాక/తూప్రాన్/శివ్వంపేట/సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా బస్తాల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే అదునుగా కొందరు ఒక్కో బస్తాపై రూ.40 అదనంగా తీసుకుంటుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. బస్తాకు రూ.266.50 తీసుకోవాల్సి ఉండగా బుధవారం చౌటకూర్‌లో రూ.300 నుంచి రూ.310 తీసుకున్నట్లు రైతుల తెలిపారు. గజ్వేల్ పట్టణంలో యూరియా కోసం రైతులు మరోసారి రోడ్డెక్కారు. తూప్రాన-గజ్వేల్ రోడ్డుపై ధర్నాకు దిగారు. గంట పాటు ఆందోళన తర్వాత, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ అక్కడికి చేరుకుని గురువారం యూరియాను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించుకున్నారు. మద్దూరు, దూళిమిట్ట మండలాల రైతులు బుధవారం రాత్రి నుంచే యూరియా కోసం పడిగాపులు కాశారు. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేపట్టారు. రైతులు క్యూలైన్‌లో చెప్పులను ఉంచారు. తూప్రాన్-గజ్వేల్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు యూరియా కోసం ద్విచక్ర వాహనంపై శివ్వంపేట వచ్చారు. యూరియా దొరకకపోవడంతో తిరిగి వెళ్తుండగా, పెట్రోల్ బంక్ సమీపంలో బొలెరో వాహనం వారిని ఢీకొట్టడంతో గాయపడ్డారు.

కొరత లేకుండా చూడండి : సంగారెడ్డి ఎమ్మెల్యే

రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించారు. అనంతరరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సదాశివపేట ఏవో రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి యూరియా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



సిద్దిపేట రూరల్ : లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్

అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టం

● ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్

వర్గల్/సిద్దిపేట రూరల్ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టమవుతుందని ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ అన్నారు. బుధవారం వర్గల్ మండలం గౌరారంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులకు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక నైపుణ్యతను పెంపొందించేందుకు ఆర్బీఐ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫోన్‌లో వచ్చిన అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పవద్దని అవసరమైతే బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా నారాయణరావుపేట మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులకు, రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ బ్యాంకు రుణాలు, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక రక్షణ, బీమా వంటఇ అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ జనరల్ మెనేజర్ సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోమతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఉదయ్ కిరణ్ , యూబీఐ డీజీఎం అరవింద్, రిజనల్ హెడ్ శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్లు మహేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాంకేతిక తోడ్పాటు హర్షణీయం



ఐఐటీహెచ్‌లో హ్యాకథాన్ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

● ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో విద్యార్థుల సాంకేతిక తోడ్పాటు హర్షణీయమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. బుధవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కేంద్ర ఆర్థిక సేవల విభాగం కందిలోని ఐఐటీహెచ్‌లో ఫినషీల్డ్ హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే-2025 పోటీలను నిర్వహించారు. మొబైల్ ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో మోసాలను అరికట్టడం, సైబర్ సెక్యూరిటీ సవాళ్లను పరిష్కరించడం వంటి అంశాలపై ఈ పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా 661 బృందాలు దరఖాస్తు చేసుకోగా, 72 టీమ్‌లను ఎంపిక చేశారు. ఐఐటీహెచ్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 4 టీమ్‌లకు రూ.20లక్షల బహుమతులను అందజేశారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న జానులిరి

కుకునూరుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ క్రీడలు బుధవారం ముగిసాయి. చివరి రోజు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫోక్ డ్యాన్సర్ జానులిరి హాజరయ్యారు. ఆమె విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ముందుగా ఎంఈవో సత్తయ్య మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. పోల్కంపల్లి నరేందర్ లకుడారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులకు గాను రూ. 10వేలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, శ్రీనివాస్‌రెడ్డి, కోల సద్గుణ, మల్లం ఐలయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి గారూ.. జర ఇటు చూడండి

● సమస్యలను తెలుపుతూ బ్యానర్ ఏర్పాటు



తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన బ్యానర్

రామచంద్రాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ పలుమార్లు నిరసనలు తెలిపింది. అయినా ఫలితం లేకపోవడంతో, వారు ప్రధాన సమస్యలను బ్యానర్లపై ముద్రించి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సందర్శించాలంటూ ఆహ్వానిస్తూ పట్టణం ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్ల పక్కన సెల్ఫీలు దిగిన స్థానికులు, సమస్యల వల్ల పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రధానంగా పదేళ్ల క్రితం ప్రారంభమైన రేడియల్ రోడ్డు పూర్తి కాకపోవడం, స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడం, విద్యుత్ అంతరాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు లేకపోవడం, ఎస్టీపీ ప్లాంట్లు లేకపోవడంతో మురుగునీరు నేరుగా చెరువుల్లోకి వెళ్లడం వంటి సమస్యలను బ్యానర్లలో పేర్కొన్నారు. ఇప్పటికే వేల మంది తమ అభిప్రాయాలను సోషల్ మీడియాలో పొందుపర్చారని తెనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ తెలిపారు.

మాకు న్యాయం చేయండి

● ప్రధాన రహదారిపై నిర్వాసితుల ధర్నా



ధర్నా చేస్తున్న అప్పాజీపల్లి రైతులు

కొల్చారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ 765డి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని అప్పాజీ పల్లి గ్రామస్థులు బుధవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో మూలమలుపులు సరి చేయడానికి అధికారులు రైతుల నుంచి భూమిని సేకరించారు. అప్పటి ఎమ్మెల్యే మదన్ రెడ్డి గ్రామసభ నిర్వహించి, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పక్కనే ఉన్న భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు ఆ హామీ నెరవేరలేదు. మంగళవారం రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిలో ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్, గిర్ధవర్ ప్రభాకర్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై అహ్మద్ మోహిద్దీన్ చేరుకొని ఆందోళనకారులను సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించుకున్నారు. అనంతరం రైతులు తాసిల్దార్ శ్రీనివాస్ చారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకట్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాచగిరి క్షేత్రం వద్ద వైభవంగా గణపతి హోమం



వర్గల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో వినాయక నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ ఆధ్వర్యంలో, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య హోమాది కార్యక్రమాలు అత్యంత వైభవంగా చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. గణేశ్ నిమజ్జనం కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్లు చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సురేందర్‌రెడ్డి, చంద నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్యతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడి.. నలుగురికి తీవ్ర గాయాలు



పుల్‌కల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానపూర్ గ్రామంలో బుధవారం పిచ్చి కుక్క దాడి చేసిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కుమ్మరి రామమ్మ, గంట దుర్గమ్మ, చాకలి మల్లమ్మ, ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన మరో వ్యక్తి హనువన్ ఆలయం వద్ద నిలబడి ఉండగా అటుగా వెళ్తున్న పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ సంఘటనలో నలుగురి కాళ్లకు గాట్లు పడ్డాయి. వీరిని ప్రథమ చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. క్రమం తప్పకుండా ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చి టీకాలు వేసుకోవాలని వైద్యులు సూచించారు. కాగా, ఆసుపత్రికి వెళ్లేందుకు క్షతగాత్రులకు గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

ద్విచక్ర వాహనం దహనం

గుమ్మడిదల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన సంఘటన గుమ్మడిదల మండలం వీరారెడ్డి పల్లి లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి కథనం ప్రకారం వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కిరణ్‌కు చెందిన ద్విచక్ర వాహనానికి మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. దాని విలువ సుమారుగా రూ.30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. తన ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన దుండగులు పైన చర్యలు తీసుకోవాలని ఎర్రోళ్ల కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

జోగిపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైనందుకు గాను నిందుతుడికి మూడు నెలల జైలు శిక్ష పడిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల మేరకు సంగరెడ్డి జిల్లా చిద్రుప్ప గ్రామానికి చెందిన నర్సింహులు తన కూతురిని 31 మే 2015లో జోగిపేటలో పాలిటెక్నిక్ పరీక్ష రాసేందుకు తీసుకొచ్చాడు. పరీక్ష అనంతరం తిరుగు ప్రయాణంలో ఉండగా కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టగా నర్సింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని అసుపత్రికి తరలిస్తుండగా మర్గమధ్యలో మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి విచారణ కొనసాగగా గురువారం తీర్పు వెలువడింది. నిందితుడు బైరి సత్యనరేందర్‌కు కోర్టు మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


కల్హేర్ మండలంలోని రాపర్తిలో ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్/సిర్గాపూర్/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్‌లో బుధవారం రేషన్‌కార్డు మంజూరు పత్రాలు, ఉచిత రేషన్ బియ్యం అందజేశారు. కల్హేర్ మండల పరిధిలోని రాపర్తిలో ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభల్లో గ్రామీణ పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రహదారుల పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు ఎర్ర రవి, హన్మండ్లు, అంతుపాటిల్, బాల్‌రెడ్డి, నర్సారెడ్డి, జయవంత్, గంగాధర్ వెంకట్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, హరిలాల్, శ్యాంనాయక్ పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పెద్దశంకరంపేటలోని రైతువేదికలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో షాకీర్‌అలీ, కాంగ్రెస్ మండల నాయకులు మధు, నారాయణగౌడ్, ఆర్ఎస్.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


పోచమ్మరాల్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

హవేళిఘణపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోచారం వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని పోచమ్మరాల్ గ్రామంలో పోచారం డ్యాం వరదలకు కొట్టుకుపోయిన రహదారి, పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలను ఆగం చేశారన్నారు. పోచమ్మరాల్‌లో తన సొంత డబ్బులతో బోర్లు వేయిస్తామన్నారు. రాజిపేటలో వరదలకు ప్రాణనష్టం జరగడం బాధాకరమన్నారు. అనంతరం హవేళిఘణపూర్, పాటిగడ్డ తండాల్లో గణపతి పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీకాంత్, రాము, గోపాల్ నాయక్, బొజ్జ పవన్, రిజ్వాన్ పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై కవిత ఆరోపణలు సరికాదు : ఎమ్మెల్యే

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బుధవారం ఖండించారు. నాటి నుంచి నేటివరకు హరీశ్‌రావు కేసీఆర్‌కు వెన్నుదన్నుగా ఉంటూ పదవులను త్యాగంచేసి ఉద్యమాలకు ఊపిరిపోశాడన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, పార్టీ పటిష్టతకు ఆయన చేసిన కృషి అమోఘమన్నారు. హరీశ్‌రావుపై కవిత ఆరోపణలు చేయడంపై విచారం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికే 'భూభారతి'


మనూరు మండలం దుద్దగొండలో భూమిని పరిశీలిస్తున్న ఉమాహారతి

మనూరు/నారాయణఖేడ్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిందని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి పేర్కొన్నారు. బుధవారం దుద్దగొండ గ్రామపంచాయతీలోని రైతు ప్రసాద్ భూమి ధరణిలో 12 గుంటలు నమోదు కాకపోవడంతో పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. తహసీల్దార్ విష్ణుసాగర్‌కు సమస్యను పరిష్కరించాలని పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఖాజామైనోద్దిన్, మాజీ సర్పంచ్ రాజు, ధన్‌రాజ్, సద్దాం, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు. చిన్నారులు విద్యనభ్యసించే పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. మండల పరిధిలోని మహాదేవ్‌పల్లి, మాసాన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఆమె వెంట కల్హేర్ ఎంపీఈవో శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఆడిటోరియానికి పీవీ నరసింహారావు పేరు

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పనులు పరిశీలిస్తున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రూ.16 కోట్లతో నిర్మితమవుతున్న ఆడిటోరియానికి తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు పేరు నామకరణం చేయనున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయం పక్కన నిర్మిస్తున్న ఆడిటోరియాన్ని సందర్శించి మాట్లాడారు. ఒకేసారి రెండు వేలమంది వీక్షించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఎదురుగా పీవీ నర్సింహారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని అన్నారు. అనంతరం రూ.2 కోట్లతో నిర్మిస్తున్న ఇంజనీరింగ్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ శాఖల భవనాలను, గౌతమ్‌నగర్‌లో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు డీఈలు రామస్వామి, కృష్ణవేణి, ఈఈ సురేష్, ఏఈ శివకుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మవీన్‌గౌడ్, గంగాధర్‌రావు, రవిగౌడ్, సంజీవరెడ్డి, మతిన్ పాల్గొన్నారు.

బాలికల రక్షణకు చట్టాలు దోహదం

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణకు చట్టాలు దోహదపడుతాయని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాలికల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. క్షేత్రస్థాయిలో బేటీపడావో-బేటిబచావో కార్యక్రమాన్ని విస్తృతస్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరుబాట


డీఆర్వో భుజంగరావు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశంగౌడ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... బుధవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాందాస్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్ మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. దెబ్బతిన్న ఇండ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. డ్రైనేజీ, రోడ్లు, బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలన్నారు. అనంతరం డీఆర్వో భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్‌తోనే అమలు


గాలి అనిల్‌కుమార్

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ల అమలు విషయాన్ని ప్రజల్లోకి వెళ్లేటట్టు కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. బీసీలకు సుస్థిరస్థానాన్ని కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులేస్తోందని తెలిపారు. పదేళ్ల కేసీఆర్ అధికారంలో ఉండి అణగారిన వర్గాలను తొక్కారని అన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిన సంక్షేమ రంగాల అభివృద్ధిపై ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు.

పొరపాట్లు లేకుండా విధులు నిర్వర్తించాలి : ఐనేష్


సంగారెడ్డిలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఐనేష్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పొరపాట్లు లేకుండా విధులు నిర్వర్తించి భూములకు సంబంధించిన కొలతల మ్యాపులను రైతులకు అందజేయాలని ల్యాండ్ అండ్ సర్వే జిల్లా అధికారి ఐనేష్ లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సూచించారు. సంగారెడ్డిలో మొదటి విడత శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు బుధవారం సంగారెడ్డిలో ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. భూభారతి చట్టంలో సర్వేయర్లకు పెద్దఎత్తున అవకాశం కల్పించిందన్నారు. శిక్షణలో ఉత్తీర్ణులవ్వని సర్వేయర్లు ఆందోళన చెందొద్దని, వారికి ఈ నెల 13, 14 తేదీల్లో తిరిగి పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు రాజు, శ్రీనివాసప్, బిక్షపతి, రుహుఉల్ల, కార్యాలయ సూపరింటెండెంట్ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఆస్పత్రులు నడుపొద్దు : డీఎంహెచ్‌వో


ఆస్పత్రిని సీజ్ చేస్తున్న నాగనిర్మల

కంగ్టి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఆర్ఎంపీ వైద్యం పేరిట ఆస్పత్రులను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగనిర్మల హెచ్చరించారు. బుధవారం కేంద్రమైన కంగ్టిలో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కంగ్టిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఓ ఆస్పత్రిని సీజ్ చేయగా, మరో ఆస్పత్రికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. వైద్యులు తప్పకుండా అనుమతులు తీసుకున్నాకే ఆస్పత్రులను కొనసాగించాలన్నారు. అనంతరం ఆమె కంగ్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులతో పాటు, వసతులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి గల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగమణి, ఆయూష్ వైద్యులు నారాయణరావు, సిబ్బంది నారాయణరెడ్డి పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

చిన్నశంకరంపేట/చేగుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యమందుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల స్లాబ్ నుంచి నీళ్లు కారుతాయని, మరమ్మతులు చేయించాలని వైద్యాధికారి డాక్టర్ సాయిసింధుకు సూచించారు. అనంతరం మందుల స్టోర్, ల్యాబ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవిప్రసాద్, సీహెచ్‌వో యాదగిరిరావు, ఎమ్ఎల్ఎహెచ్‌పీ డాక్టర్ హరిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట డాక్టర్ అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అవగాహనతోనే సైబర్ మోసాలకు చెక్

సంగారెడ్డి క్రైం/పాపన్నపేట/జహీరాబాద్/కల్హేర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే సైబర్ మోసాలకు చెక్ పెట్టడం జరుగుతుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఎల్లెంకి డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు సైబర్ మోసాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఎదురుకుంటున్న సమస్య అన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దన్నారు. పట్టణ ఎస్ఐ సర్దార్, ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని మెదక్ అదనపు డీఎస్పీ మహేందర్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జహీరాబాద్ పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో సైబర్‌జాగురుక దివస్ కార్యక్రమంలో భాగంగా ఆర్థికనేరాలు, సైబర్‌క్రైం, డ్రగ్స్‌పై పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కల్హేర్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. కల్హేర్‌లో బుధవారం ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.

చేయి చేయి కలిపారు.. గండిని పూడ్చారు



అల్లాదుర్గం శివారులోని కుమ్మరికుంటకు గండి పడి వృథాగాపోతున్న నీరు, రైతులందరూ కలిసి గండిని పూడ్చివేసిన దృశ్యం

అల్లాదుర్గం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువుకుంటలకు పడిన గండ్లతో ఆయకట్టు పంట పొలాలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో అపారనష్టం చవిచూసిన రైతులు ప్రభుత్వం తీసుకునే చర్యలపై ఎదురుచూడకుండా చేయి చేయి వేసి గండిని పూడ్చారు అల్లాదుర్గం మండలం కాయిదంపల్లిలోని రైతులు. పక్షంరోజులుగా కురిసిన భారీ వర్షాలతో శివారులోని కుమ్మరికుంటకు గండిపడింది. నీరంతా వృథాగా పోతూ కట్టకింద ఉన్న పొలాలు దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు పరిశీలించినా చర్యలు తీసుకోకపోవడంతో బాధిత రైతులు రూ.3-4 లక్షలు ఖర్చుచేసి గండిని పూడ్చి ఆదర్శంగా నిలిచారు.

న్యూస్ బాక్స్

మహిళలందరూ సంఘటితం కావాలి

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలందరూ సంఘటితం కావాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలు అస్మా పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని శేఖాపూర్ గ్రామంలో మహిళా నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

డీసీసీబీలో రుణ సౌకర్యం

పాపన్నపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులతో పాటు అన్నివర్గాల వారికి వివిధ రకాల రుణ సౌకర్యం కల్పిస్తున్నామని పాపన్నపేట డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ జాదవ్ కిషన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో డీసీసీబీ బ్యాంక్ కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే కలిగే లాభాలపై వివరించారు.

'పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి షర్ఫోద్దీన్, పల్లె దవాఖానా వైద్యులు సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం పేట మండల పరిధిలోని ఎం.లక్ష్మాపూర్ గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పత్తి దిగుమతి సుంకం రద్దుపై నిరసన

కొండాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పత్తి పంట దిగుమతి విధించే 11 శాతం సుంకాన్ని ఉపసంహరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలనీ మండల కేంద్రమైన కొండాపూర్‌లో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. ఈ నిరసనలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగభూషణం, ఆసిఫ్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీధికుక్కలతో అవస్థలు : సీపీఎం

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో వీధికుక్కల బెడద అధికమైందని సీపీఎం నాయకులు మైపాల్ పేర్కొన్నారు. పట్టణంలో కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

గెలుపోటములు సహజం

పాపన్నపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని పాపన్నపేట మండలం యువజన నాయకుడు మహమ్మద్ అలీ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో కొనసాగుతున్న ఎస్జీఎఫ్ క్రీడల్లో మొదటిరోజు గెలుపొందిన క్రీడాకారులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

టీచర్స్ లెర్నింగ్ మేళా

కొండాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు టీచర్స్ లెర్నింగ్ మేళాకు శ్రీకారం చుట్టినట్లు ఎంఈవో దశరథ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కొండాపూర్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి టీఎల్ఎమ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిరిజన మినీ గురుకుల పాఠశాల తనిఖీ

కల్హేర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గిరిజన మినీ గురుకుల పాఠశాలను నిజాంపేట మండల ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్, ఎంపీడీవో సంగ్రామ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

పాఠశాలలో ఎంపీడీవో తనిఖీ

కంగ్టి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీంరా అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో సత్తయ్య ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను, పశువులకు కొనసాగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ-పాస్ ద్వారా ఎరువులు అమ్మాలి

ఝరాసంగం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ల దుకాణాల నిర్వాహకులు ఈ-పాస్ ద్వారానే ఎరువులు అమ్మాలని వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి పేర్కొన్నారు. బుధవారం ఝరాసంగంలో గల ఆయా ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణాల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

చెరువుకు చేరేనా?

(5వ పేజీ తరువాయి)

నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే, గతేడాది చెరువుల్లో చేపపిల్లలు వదిలిన కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదన్న కారణంతో ఈ ఏడాది బిడ్లు దాఖలు చేసేందుకు ముందుకు రాలేదు. సెప్టెంబరు 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఇచ్చినప్పటికీ ఒక్కరూ కూడా దాఖలు చేయలేదు. దాంతో 8 వరకు గడువు పొడగించారు.

ఆలస్యమైతే ఎదుగుదలపై ప్రభావం

కిలో సైజు చేప పెరగాలంటే కనీసం ఆర్నెళ్ల సమయం పడుతుంది. జూలై, ఆగస్టు మాసంలో వదిలితే ఈ ఏడాది డిసెంబరు, వచ్చే ఏడాది జనవరి నుంచి చేపలు పట్టుకొని విక్రయించుకునే అవకాశం ఉంటుంది. చేప పిల్లలను ఆలస్యంగా వదిలితే ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. సెప్టెంబరులో వదిలితే అవి కిలో సైజు రావడానికి ఫిబ్రవరి వస్తుంది. ఇంకా పెరగాలంటే ఏప్రిల్, మే వచ్చేస్తుంది. ఎండల కారణంగా నీరు తగ్గి చేపలు మృతి చెందే అవకాశం ఉంటుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమాత్యా.. ఆలకించండి!

(5వ పేజీ తరువాయి)

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, ప్రసూతి, ఎముకలు, కీళ్లు, చిన్నపిల్లలు తదితర వైద్య సేవలందుతున్నాయి. అంతేకాకుండా న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే సీటీ స్కాన్‌లో స్పష్టంగా నిర్ధారణ కాని జబ్బు ఎంఆర్ఐ స్కాన్‌లో తేలే అవకాశం ఉంటుంది. ఇటీవల ఇక్కడి డాక్టర్లు ఎంఆర్ఐ స్కానింగ్‌కు ఎక్కువగా సిఫారసు చేస్తున్నారు. స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఉస్మానియాకు రెఫర్ చేస్తున్న పరిస్థితి ఉన్నది. అయితే, ఎంఆర్ఐ యంత్రం రూ.10 కోట్ల వరకు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. రోగుల డిమాండ్, ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి జీజీహెచ్‌లో ఎంఆర్ఐ స్కాన్ యంత్రం మంజూరు చేయాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభోత్సవంతో పాటు 500 పడకల ఆస్పత్రి శంకుస్థాపనకు గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ రానున్నారు. ఈ నేపథ్యంలో ఎంఆర్ఐ స్కానింగ్ మంజూరు చేయాలని మంత్రిని ప్రజలు కోరుతున్నారు.

గణనాథుల నిమజ్జనానికి ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. శోభాయాత్రల మార్గంలో విద్యుత్ తీగలు లేకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. అన్ని ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చెరువులు, కుంటల వద్ద నీళ్లలోనికి దిగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయించామని చెప్పారు. నిమజ్జనానికి క్రేన్‌లను అందుబాటులో ఉంచామని తెలిపారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ బృందాలు సిద్ధంగా ఉంటాయని వెల్లడించారు. గణేష్ ఉత్సవ కమిటీ, మండప నిర్వాహకులు పోలీసు వారితో సహకరించాల్సిందిగా ఎస్పీ కోరారు.

జహీరాబాద్‌లో ఏర్పాట్ల పరిశీలన

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేడు జహీరాబాద్ పట్టణంలో జరగనున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను బుధవారం ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. వారు వేర్వేరు సమయాల్లో విగ్రహాలను నిమజ్జనం చేయనున్న మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును పరిశీలించారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం : రాజిరెడ్డి

వెల్దుర్తి/మాసాయిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు ఆయా గ్రామాల్లో తల్లి ఆరోగ్యం-శిశువు భవిష్యత్తు కోసం తనవంతు చేయూతగా మాతృదేవోభవ కానుకగా ప్రోటీన్, ఐరన్ టానిక్ కిట్లను గర్భిణులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు. మాసాయిపేట మండలంలో గర్భిణులకు ప్రోటీన్లతో కూడిన కిట్లను రాజిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, నాగిరెడ్డి, డైరెక్టర్ నరసింహులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండ

రాయికోడ్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, నూతన రేషన్‌కార్డులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్, తహసీల్దార్ ఆశాజ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీనర్సింహులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య కోసం రూమ్ టు రీడ్

కోహీర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలైన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్న లక్ష్యంతో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తున్నదని సంస్థ ఎల్ఎఫ్ (లిటరసీ ఫెసిలిటేటర్) సంధ్య అన్నారు. బుధవారం వెంకటాపూర్, పైడిగుమ్మల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్యాంపెయిన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆమె మాట్లాడుతూ రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపికచేసిన పాఠశాలలో విద్యార్థులు చదువుకునేందుకు ప్రత్యేకంగా లైబ్రరీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు, చదవడం, రాయడం మాట్లాడడం నేర్పించేందుకు ప్లెడ్జి రీడింగ్ టైం, రీడింగ్ మేలా, ర్యాలీస్, స్ట్రీట్ ప్లే, రీడ్ ఎ థీమ్, స్టోరీ రీడింగ్ ఇన్ అసెంబ్లీ, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్ యాక్టివిటీస్, ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కేసీఆర్‌ను ముట్టుకుంటే.. రాష్ట్రం అగ్ని గుండమే

చిలప్‌చెడ్/మాసాయిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణను తెచ్చిన వ్యక్తిపై సీబీఐ విచారణ వేస్తారా.. కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్ని గుండమవుతుందని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం నర్సాపూర్-జోగిపేట ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, జైరాంరెడ్డి, సయ్యద్‌ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన మాసాయిపేటలోని 44వ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

చేగుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేగుంట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కరే ప్రకాష్ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రకాష్ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేగుంటలో సర్పంచ్‌గా తన తల్లి పనిచేసిన పట్టణాభివృద్ధికి సహకరించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.